సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



గోశాలలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న కోడెలను సూర్యపేట, జనగామ జిల్లాల్లోని గోశాలలకు గురువారం అందజేశారు. వీరభద్ర, శివలింగ గోశాలలకు 20 చొప్పన కోడెలను అందజేశారు.



ప్రశాంతంగా పది పరీక్షలు

వేములవాడఅర్బన్: పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. తిప్పాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం పరిశీలించారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/24.0

వాతావరణం

వాతావరణం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

జరిగిన దాని గురించి ఎప్పుడూ చింతించకు. ఎందుకంటే మనకు జరిగే మంచి మనకు ఆనందాన్ని ఇస్తే జరిగిన చెడు అనుభవాన్ని ఇస్తుంది. – మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శుక్ర 6:33	శని 4:39

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పౌష్టికాహారంతో ఆరోగ్యం



సిరిసిల్లటౌన్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, చింతోజు భాస్కర్, మురళీధర్, రఘు, ఆడెపు వేణు, కళ్యాణి, జ్యోతి పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై శ్రద్ధ పెట్టాలి



సిరిసిల్లటౌన్: ఇంధన పొదుపుపై డ్రైవర్లు శ్రద్ధ పెట్టి.. సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సంస్థ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీర్ల వెంకటేశ్వర్లు కోరారు. సిరిసిల్ల డిపోలో బస్సు వాషింగ్‌ప్లాంటును గురువారం ప్రారంభించి మాట్లాడారు. సంస్థలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కొత్తబస్టాండులో వాటర్‌కూలర్‌ను ప్రారంభించారు. డీఎం మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీకి ఏర్పాట్లు



సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలో రంజాన్ పండుగకు ప్రభుత్వం ఇచ్చే కానుకలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. జిల్లాలోని 3 వేల కుటుంబాలకు రంజాన్ కానుకలు అందించనున్నారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని 1,500 చొప్పున కుటుంబాలకు రంజాన్ కానుకలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఇచ్చేందుకు ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి రూ.3 లక్షల చొప్పున మంజూరు చేసిందని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి, డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు గురువారం తెలిపారు. రంజాన్ గిఫ్ట్ ప్యాక్‌లను జిల్లా మైనార్టీ వెల్ఫేర్ శాఖ ఓఎస్డీ సర్వర్‌మియా పరిశీలించారు.

కంటి వెలుగులో 3,162 మందికి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో కంటి వెలుగులో భాగంగా 3,162 మందికి గురువారం పరీక్షలు చేశారు. జిల్లాలోని 23 ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు జరిగాయి. 403 మందికి రీడింగ్ కంటి అద్దాలను, 544 మందికి పాయింట్ కంటి అద్దాలను అందించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో జనవరి 19 నుంచి 50 రోజులుగా 1,85,531 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 30,743 మందికి రీడింగ్ అద్దాలను, 25,285 మందికి పాయింట్ అద్దాలను అందించినట్లు జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు తెలిపారు. జిల్లాలో 207 మంది సిబ్బంది కంటి వెలుగులో పాల్గొన్నట్లు వివరించారు.

ప్రభుత్వ ఐటీఐలో జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళా

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం మండెపల్లి పరిధిలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 10న జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.కనకయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. 2022 సంవత్సరం నాటికి ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ డీజిల్, మెకానిక్ మోటార్ వెహికల్, వెల్డర్ ట్రేడ్‌లలో ఉత్తీర్ణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్సెస్సీ మెమో, ఐటీఐ మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్, కుల సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95056 74905, 81067 94500లలో సంప్రదించాలని కోరారు.



కొండగట్టులో దర్శనానికి బారులుతీరిన స్వాములు



అగ్రహారంలో రథోత్సవంలో మాలధారులు



అంజన్న ఆలయంపై స్వామివారి జెండా ఎత్తుతున్న అర్చకులు, అధికారులు

పవనసుత హనుమా..

- కొండగట్టులో ఘనంగా చిన్నజయంతి
- అగ్రహారంలో వైభవంగా రథోత్సవం

కొండగట్టు(చొప్పదండి)/వేములవాడఅర్బన్: శ్రీరామ.. జయరామ.. జయజయ రామా నామ స్మరణలతో కొండగట్టు అంజన్న క్షేత్రం పులకించిపోయింది. జైశ్రీరాం.. జైహనుమాన్.. స్మరణతో కొండంతా మార్మోగింది. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా కొండగట్టు అంజన్న క్షేత్రం కాషాయమయమైంది. దీక్షాపరులతో కిక్కిరిసింది. జయంతి ఉత్సవాలు బుధవారం అర్ధరాత్రి నుంచే ప్రారంభం కాగా.. గురువారం అర్ధరాత్రి వరకు కూడా దీక్షాపరులు కొండకు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని, ఇరుముడి సమర్పించి, మాల విమరణ చేశారు. ప్రధాన అర్చకుడు జితేంద్రప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో అరటిపండ్లతో అంజన్నకు ప్రత్యేక అలంకరణ చేశారు. బుధవారం రాత్రి వరకే లక్షకుపైగా భక్తులు రాగా.. గురువారం రాత్రి వరకు మరో లక్షన్నరకు పైగా భక్తులు మాల విరమణ చేశారు. కలెక్టర్ యాస్మిన్ భాషా, ఎస్పీ భాస్కర్, ఎమ్మెల్యే రవి శంకర్, ఈవో వెంకటేశ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అగ్రహారంలో..

వేములవాడ మండలంలోని అగ్రహారం జోడాంజనేయస్వామి సన్నిధి హనుమాన్ మాలధారులతో కిటకిటలాడింది. దాదాపు 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు అనంతాచారి, లక్ష్మణాచారి, శ్రీధరచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు ఆలయంపై స్వామి వారి జెండాను ఎత్తారు. మధ్యాహ్నం అంజన్న మాలధారులకు అన్నదానం చేశారు. సాయంత్రం నిర్వహించిన రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. అంజన్నను వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, బీఆర్‌ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి తదితరులు వేర్వేరుగా అంజన్నను దర్శించుకున్నారు.



కొండగట్టులో క్యూలైన్‌లో హనుమాన్ దీక్షాస్వాములు

మన పోలీసులు.. మరోసారి హస్తినకు..?

- కరీంనగర్ పోలీసులపై మరోసారి పార్లమెంటుకు ఫిర్యాదు
- స్పీకర్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేసిన బీజేపీ ఎంపీలు
- నాలుగేళ్లలో మూడోసారి పార్లమెంటుకు కంప్లయింట్
- అరెస్టుపై స్పీకర్‌కు సమాచారం ఇచ్చిన సీపీ సుబ్బారాయుడు
- బీజేపీ నిరసనలు, బీఆర్‌ఎస్ ప్రెస్‌మీట్లతో ఉమ్మడి జిల్లాలో పెరిగిన వేడి



ఈనెల 5న తెల్లవారుజామున 12.15 నిమిషాలకు ఎంపీ బండి సంజయ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అరెస్టు వ్యవహారం మరోసారి ఢిల్లీకి చేరింది. పార్లమెంటు సమావేశాలకు హాజరుకావాల్సిన బాధ్యత కలిగిన ఎంపీని అన్యాయంగా, అక్రమంగా వారెంట్లు లేకుండా అరెస్టు చేశారంటూ బీజేపీ ఎంపీలు బుధవారం పార్లమెంటు స్పీకర్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేశారు. ఆర్టికల్ 223 ప్రకారం.. బీజేపీ ఎంపీ సోయం బాపూరావు ఈ నోటీసులను ఇచ్చారు. దీంతో కరీంనగర్ పోలీసులు మరోసారి వార్తల్లో నిలిచారు. వాస్తవానికి బండి సంజయ్, పోలీసుల మధ్య జరుగుతున్న ఘర్షణ ఈనాటిది కాదు. నాలుగేళ్లుగా సంజయ్– పోలీసుల నడుమ నడుస్తున్న ఈ వివాదంలో పార్లమెంటుకు ఫిర్యాదు చేయడం ఇది మూడోసారి. తాజాగా మరోసారి ఈ వివాదం పార్లమెంటు గడప తొక్కడంతో మరోసారి ఆసక్తికరంగా మారింది. మొత్తం అరెస్టు అనంతరం వరంగల్ పోలీసులకు అప్పగించిన వ్యవహారం మొత్తాన్ని స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాకు కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు మెయిల్ ద్వారా తెలియజేశారు. వివాదం ఫిర్యాదుకే పరిమితమవుతుందా? మరోసారి కరీంనగర్ పోలీసులు ప్రివిలేజ్ కమిటీ ఎదుట హాజరవుతారా? అనేది ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు నగరంలో బీజేపీ చేపట్టిన నిరసనలు, బీఆర్‌ఎస్ ప్రెస్‌మీట్‌తో రాజకీయం వేడెక్కింది.

గతంలో ఏం జరిగింది?

- 2019లో ఆర్టీసీ సమ్మె సందర్భంగా సంజయ్–పోలీసుల మధ్య తొలిసారిగా వివాదం చెలరేగింది. ఆర్టీసీ కార్మికుడు బాబు ఆకస్మికంగా మరణించాడు. దీంతో అతని మృతదేహంతో ధర్నా చేసేందుకు బండి సంజయ్ సిద్ధమయ్యారు. ఆ సమయంలో ఇన్‌చార్జి సీపీగా డీఐజీ సత్యనారాయణ వ్యవహరించారు. ఆ సమయంలో పోలీసులు తనతో దురుసుగా వ్యవహరించారని బండి తీవ్రంగా మండిపడ్డారు. అనంతరం పార్లమెంటు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో పోలీసులు జరిగిన వివాదంపై వివరణ ఇచ్చారు.
- 2022 జనవరి 2న జీవో 317ను రద్దు చేయాలని సంజయ్ తన పార్టీ కార్యాలయంలో తలపెట్టిన 'జాగరణ్ దీక్ష' ఉద్రిక్తలకు దారితీసింది. రాత్రిపూట సీపీ సత్యనారాయణ స్వయంగా తలుపులు బద్దలుకొట్టి మరీ ఎంపీ బండి సంజయ్, అతని అనుచరులను అరెస్టు చేయడంతో అప్పట్లో తీవ్ర వివాదంగా మారింది. ఇదికాస్త పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీకి చేరింది. దీంతో అరెస్టు సమయంలో సీపీ సత్యనారాయణ, ఏసీపీలు ప్రకాశ్, తుల శ్రీనివాస్‌తోపాటు పలువురు ఇన్‌స్పెక్టర్లు, సబ్–ఇన్‌స్పెక్టర్లు కూడా ఢిల్లీ కమిటీ ముందు హాజరవ్వాల్సి వచ్చింది.
- అదే నెలలో బీసీ ఎంపీని అరెస్టు సమయంలో ఇబ్బందిపెట్టారంటూ బీసీ కమిషన్‌కు ఫిర్యాదు వెళ్లింది. దీంతో అప్పటి సీపీ సత్యనారాయణ, అడిషన్ డీసీపీలు చంద్రమోహన్, శ్రీనివాస్ కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు.
- గతేడాది నవంబరు 27వ తేదీన భైంసా సభకు అనుమతి లేదంటూ జగిత్యాల సమీపంలో అరెస్టు చేసిన పోలీసులు అదే రోజు రాత్రి ఆయనను కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లోని నివాసంలో దింపి వెళ్లిపోయారు. ఈ విషయంలోనూ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేసేందుకు సంజయ్ సిద్ధమైనా ఆఖరు నిమిషంలో విరమించుకున్నారు.
- ఏప్రిల్ 5న తెల్లవారుజామున 12.15 నిమిషాలకు ఎస్సెస్సీ పేపర్ లీకేజీ కుట్రలో ఎంపీ బండి సంజయ్ పాత్ర ఉందంటూ కరీంనగర్ పోలీసులు ఆకస్మిక అరెస్టుకు దిగారు. ఈ సందర్భంగా సంజయ్‌కు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సంజయ్ ప్రతిఘటించడం, అనుచరులు అడ్డుకోవడంతో బలవంతంగా అరెస్టు చేశారు. దీనిపైనా కేంద్ర ప్రభుత్వ పెద్దలతోపాటు, బీజేపీ అగ్రనేతలు భగ్గుమన్నారు. పోలీసుల తీరును తీవ్రంగా తప్పుబడుతూ మరోసారి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. సీపీ సుబ్బారాయుడు సైతం బుధవారం జరిగిన అరెస్టు వ్యవహారం మొత్తాన్ని పార్లమెంటు స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాకు మెయిల్ ద్వారా తెలియజేశారు. ఈ వివాదం మరింత ముదిరితే కరీంనగర్ పోలీసులు మరోసారి హస్తిన ప్రయాణం తప్పదని అభిప్రాయపడుతున్నారు. ఏం జరిగినా తాము చట్టపరిధిలోనే వ్యవహరించామని కరీంనగర్ పోలీసులు ధీమాగా ఉన్నారు.

జైలు వద్ద సందడి

బండి సంజయ్‌ను కరీంనగర్ జైలుకు తరలించిన అనంతరం గురువారం ఉదయం నుంచి జిల్లా కారాగారం వద్ద మీడియా ప్రతినిధుల సందడి నెలకొంది. ఆయనను కలిసేందుకు బండి సంజయ్ భార్య అపర్ణ వచ్చారు. ఆమె వెంట బండి శ్రవణ్ కుమార్, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు ఉన్నారు. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ కూడా ములాఖత్ ద్వారా బండిని పరామర్శించారు.

ఫైలేరియా రహిత సమాజం నిర్మిద్దాం

- వైద్య ఆరోగ్యశాఖ ఏడీ నాగయ్య



పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం సభ్యులు

సిరిసిల్ల/ముస్తాబాద్(సిరిసిల్ల): ఫైలేరియా రహిత సమాజ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మూడో విడత సర్వేను చేపట్టిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వరంగల్ అడిషనల్ డైరెక్టర్ నాగయ్య పేర్కొన్నారు. జిల్లాలోని పోతుగల్, గజసింగవరం, ఎల్లారెడ్డిపేట, చందుర్తి, మల్యాల, ననుగుల, సిరిసిల్ల అంబేద్కర్‌నగర్‌లలో ఏడీతోపాటు ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిశీలకులు డాక్టర్ శిరీష బృందం వేర్వేరుగా పరిశీలించారు. రక్త నమూనాల సేకరణ తీరుతెన్నులను పరిశీలించారు. ఏడీ నాగయ్య మాట్లాడుతూ రెండో రోజు జిల్లాలో 358 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేయగా.. ముగ్గురికి పాజిటివ్‌గా తేలిందని, మొత్తంగా జిల్లాలో నాలుగు పాజిటివ్ కేసులు నమోదైనట్లు తెలిపారు. రెండు రోజులలో సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పాజిటివ్ తేలిన విద్యార్థులలో మైక్రో ఫైలేరియాను నియంత్రించేందుకు చికిత్స చేయనున్నట్లు తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులలో ఇలాంటి పరీక్షలు చేయరని, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. హెచ్ఈవోలు మెంగని లింగం, సోమేశ్, ఎల్‌టీలు ప్రవీణ్, మురళీ, సూపర్‌వైజర్లు ప్రసాద్ ఉన్నారు.

రాజన్న సేవలో అంజన్న భక్తులు



వేములవాడ: వేములవాడ రాజన్న క్షేత్రం గురువారం కాషాయమయమైంది. రాజన్న అనుబంధ భీమేశ్వరస్వామి ఆలయంలోని హనుమాన్ ఆలయంలో స్థానాచార్యులు అప్పాల భీమాశంకర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఎస్సై మృతితో విషాదం

- సిరిసిల్లలో హెడ్‌కానిస్టేబుల్‌గా, ఏఎస్సైగా సేవలు
- గోదావరిఖనిలో తిలక్‌నగర్ శ్రీనుగా సుపరిచితుడు
- మూగబోయిన జమ్మికుంట మండలం మోత్కులగూడెం



తిలక్‌నగర్‌లోని ఇంటి వద్ద మృతదేహాలు

గోదావరిఖని/జమ్మికుంట/సిరిసిల్ల: జనగామ ఎస్సైగా పనిచేస్తున్న కాసర్ల శ్రీనివాస్ ఆత్మహత్య ఉమ్మడి జిల్లాను కదలించింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఆయన తిలక్‌నగర్ శ్రీనుగా అందరికీ సుపరిచితుడు. ఆయన మరణవార్తతో చిన్ననాటి స్నేహితులంతా షాక్‌కు గురయ్యారు. కుటుంబ తగాదాలతో ఆయన భార్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా.. ఆమె మృతిని తట్టుకోలేక సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని శ్రీనివాస్ బలవన్మరణానికి పాల్పడిన విషయం తెల్సిందే. మధ్య తరగతి కుటుంబానికి చెందిన శ్రీనివాస్ బాల్యమంతా గోదావరిఖనిలోనే సాగింది. స్థానిక జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో పదో తరగతి, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివాడు. కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఎక్కువ కాలం పనిచేశారు. ఎస్సైగా పదోన్నతిపై జనగామకు వెళ్లారు. స్వరూప, శ్రీనివాస్ దంపతులకు ఇద్దరు కుమారులు రవితేజ, భార్గవ్‌తేజ సంతానం. ఆయన మరణవార్త విని ఆప్తమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. దంపతుల మృతదేహాలను ఇక్కడకే తీసుకురానున్నట్లు బంధువుల ద్వారా తెల్సింది.

మూగబోయిన మోత్కులగూడెం

ఎస్సై శ్రీనివాస్ భార్య స్వరూపది జమ్మికుంట మున్సిపాలిటీ పరిధి మోత్కులగూడెం. గ్రామానికి చెందిన శీలం కృష్ణస్వామి, లక్ష్మి పెద్ద కూతురు. శ్రీనివాస్ ఉద్యోగ విరమణ అనంతరం మోత్కులగూడెంలోనే స్థిరనివాసం ఏర్పాటు చేసుకునేలా ఇంటి స్థలం, వ్యవసాయ భూమి కూడా కొనుగోలు చేసినట్లు తెలిసింది. అంతలోనే ఈ సంఘటన చోటుచేసుకోవడంతో గ్రామం మూగబోయింది. మృతుల కుటుంబానికి జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి సానుభూతి తెలిపారు. వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

సిరిసిల్లతోనూ అనుబంధం

ఆత్మహత్య చేసుకున్న ఎస్సై కాసర్ల శ్రీనివాస్‌కు రాజన్న సిరిసిల్లతోనూ అనుబంధం ఉంది. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా 2002 నుంచి పనిచేశారు. ఏఎస్సైగా పదోన్నతి లభించాక 2011వ రకూ ఇక్కడే విధులు నిర్వర్తించారు. వేములవాడలోనూ ఏఎస్సైగా పనిచేశారు. నక్సలైట్ల కదలికలు ఉన్న రోజుల్లోనూ చురుగ్గా పనిచేసి అధికారుల మన్ననలు పొందారు. సుమారు దశాబ్దకాలం జిల్లాలో పనిచేసిన శ్రీనివాస్ ఎస్సైగా పదోన్నతి పొంది జనగామకు వెళ్లారు. ఇటీవల ఆయన కుమారుడి వివాహానికి సైతం జిల్లా నుంచి పలువురు వెళ్లారు.

గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో రెండోవిడత గొర్రెల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలని పశుసంవర్ధకశాఖ అధికారులను కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలో రెండో విడతలో పంపిణీ చేయాల్సిన గొర్రెల యూనిట్లకు సంబంధించి లబ్ధిదారులతో చర్చించి గొర్రెల సరఫరాకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి తప్పులు జరుగకుండా గొర్రెల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ 14న హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రతీ నియోజకవర్గం నుంచి 300 మంది ప్రతినిధులు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని ఎస్సీ అభివృద్ధి అధికారి మోహన్‌రావును ఆదేశించారు. నియోజకవర్గానికి ఆరు బస్సులను కేటాయించాలని, ఇద్దరు డ్రైవర్లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. వేడుకలకు వెళ్లే వారికి టిఫిన్స్, భోజనాలు, స్నాక్స్ అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ బి.సత్య ప్రసాద్, ఆర్డీవోలు టి.శ్రీనివాస్‌రావు, పి.పవన్‌కుమార్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి వై.కొండల్‌రావు, ఎస్సీడీవో మోహన్‌రావు, పశుసంవర్ధకశాఖ అధికారి కొమురయ్య, ఎల్‌డీఎం మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేశ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు బి.గంగయ్య పాల్గొన్నారు. అంతకుముందు ఇదే అంశంపై హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నత స్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

'పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్స్ అనుమతి లేదు'

సిరిసిల్లక్రైం: పదోతరగతి పరీక్షల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి, వేములవాడలోని పరీక్ష కేంద్రాలను గురువారం పరిశీలించిన ఎస్పీ భద్రత చర్యలపై పలు ఆదేశాలు జారీ చేశారు. సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాలలో అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్ష సిబ్బందిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఈ పర్యవేక్షణలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు అనిల్‌కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఏడుగురు గైర్హాజరు

జిల్లాలో గురువారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యాధికారి రమేశ్ తెలిపారు. రెగ్యులర్ విభాగంలో 6,488 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 6,481 మంది హాజరయ్యారు.

క్లుప్తంగా

హనుమాన్ భక్తులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న సాథిక్, ఖదీర్

గంభీరావుపేట(సిరిసిల్ల): చిన్న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గంభీరావుపేట మండలకేంద్రంలోని స్వాగత్ రెస్టారెంట్ నిర్వాహకులు సయ్యద్ సాధిక్, ఖదీర్‌లు గురువారం హనుమాన్ భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. శ్రీ సీతారామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చేపట్టిన గరుడ సేవా ఉత్సవంలో బట్టర్ మిల్క్ ప్యాకెట్లు అందించారు.

వేములవాడలో ఫ్రాంకింగ్ మెషిన్ ఏర్పాటు



ఫ్రాంకింగ్ మెషిన్

వేములవాడ: ఇకనుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లకుండా నేరుగా ఫ్రాంకింగ్ మెషిన్ ద్వారా బ్యాంకింగ్, ఇతర అగ్రిమెంట్ పేపర్లను వేములవాడ పట్టణంలోని బద్దిపోచమ్మ ఆలయం వద్దనున్న శ్రీనివాస బుక్ సెల్లర్స్‌లో పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. గతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే తప్ప పత్రాలు లభించేవి కావు. ప్రభుత్వం రెండు ఫ్రాంకింగ్ మెషిన్లను ప్రైవేట్ వ్యక్తులకు మంజూరు చేయడంతో వేములవాడవాసులకు ఇది అందుబాటులోకి వచ్చినట్లు పారువెల్ల రాములు తెలిపారు. మరొకటి సిరిసిల్లలో సేవలందించనున్నట్లు పేర్కొన్నారు. వేములవాడ పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోతులను పట్టేస్తున్నారు..



ముస్తాబాద్‌లో ఏర్పాటు చేసిన బోను

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల కేంద్రంలో రోజురోజుకు పెరుగుతున్న వానరాల బెడదను తప్పించేందుకు ఎంపీపీ జనగామ శరత్‌రావు ప్రత్యేకంగా వాటిని పట్టే వారిని పిలిపించారు. ఈమేరకు ముస్తాబాద్‌లో పలుచోట్ల పెద్ద బోన్లను ఏర్పాటు చేశారు. బోనులలో చిక్కిన కోతులను పట్టి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టనున్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ముస్తాబాద్ ప్రజల విజ్ఞప్తి మేరకు సొంత ఖర్చులతో కోతులను పట్టే వారిని పిలిపించినట్లు తెలిపారు. ఇటీవల కోతుల దాడిలో పలువురు కాళ్లు, చేతులు విరిగి మంచం పట్టారన్నారు. కోతుల బెడద లేకుండా చేసేందుకు అందరు సహకరించాలని కోరారు.



మండే ఎండలు.. ప్రజల ఇబ్బందులు



రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. రోజువారీ పనుల నిమిత్తం రోడ్ల పైకి వచ్చే ప్రజలను ఎండలు ఇబ్బంది పెడుతున్నాయి. విద్యార్థులు, ప్రయాణికులు నానాతంటాలు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల





ఫైలేరియాపై ఫైట్

- జిల్లాలో 60 పాఠశాలల్లో రక్తనమూనాల సేకరణ
- 1,540 మంది విద్యార్థులకు పరీక్షలు
- మైక్రో ఫైలేరియాను గుర్తించే పనిలో వైద్యశాఖ
- ఇప్పటికే నాలుగు పాజిటివ్ కేసులు
- వ్యాధి నివారణే లక్ష్యంగా ముందుకు..



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ముస్తాబాద్(సిరిసిల్ల): బోధకాలు(ఫైలేరియా) రోగుల బాధలు వర్ణనాతీతం. నలుగురిలో తిరుగలేక ఆత్మన్యూనత భావానికి లోనవుతారు. జిల్లాలో వ్యాధిగ్రస్తులు ఎంతమంది ఉన్నారు, వ్యాధిని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కోసం ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. మైక్రో ఫైలేరియాను గుర్తించే పనిలో వైద్య ఆరోగ్యశాఖ నిమగ్నమైంది. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణలో భాగంగా సర్వే చేపడుతున్నారు. ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే పనిలో భాగంగా భావి భారత పౌరులైన విద్యార్థులలో మైక్రో ఫైలేరియా లక్షణాలు ఉన్నాయా అనే కోణంలో రక్త నమూనాలు సేకరిస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఎంపిక చేసిన పాఠశాలల్లోని విద్యార్థుల రక్త నమూనాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో నాలుగు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో భాగంగా ఇప్పటి వరకు పెద్దూరులోని బాబాజీకాలనీలో ఒక్క పాజిటివ్ కేసు, చందుర్తి మండలంలోని సనుగుల గ్రామంలో రెండు, తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఒక్క కేసు నమోదైనట్లు హెల్త్ వరంగల్ అడిషనల్ డైరెక్టర్ నాగయ్య తెలిపారు. జిల్లాలో 18 పాజిటివ్ కేసులు నమోదైతే వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లుగా గుర్తించి, వ్యాధి నిర్మూలన చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

జిల్లాలో పది బృందాలు

రాజన్నసిరిసిల్ల జిల్లాలో 13 మండలాలతోపాటు రెండు మున్సిపాలిటీలు సిరిసిల్ల, వేములవాడల్లో పది వైద్య బృందాలు పాఠశాలలకు వెళ్తున్నాయి. వైద్యాధికారి, ల్యాబ్ టెక్నీషియన్, సూపర్‌వైజర్, ఏఎన్ఎం, ఆశవర్కర్‌లు ఒక్కో బృందంలో ఉన్నారు. పది వైద్య బృందాలకు జిల్లాలో 60 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో ఒకటి, రెండో తరగతి చదువుతున్న 1,540 మంది విద్యార్థుల రక్త నమూనాలు సేకరిస్తారు. మైక్రోఫైలేరియా పాజిటివ్‌గా తేలిన వారికి వెంటనే చికిత్స అందించనున్నారు. వారిలో వ్యాధి ప్రబలకుండా, నిర్మూలించేలా మెరుగైన చికిత్స అందిస్తారు. జిల్లాలో శనివారం తొలిరోజు 389 మంది రక్త నమూనాలు సేకరించారు. ఆదివారం సెలవుగా కాగా.. తర్వాత రెండు రోజులు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వ్యాధి ముదిరిన వారిలో కాళ్లు, చేతులు భారీగా ఉబ్బి ఉండడం, పుండ్లు కావడం, నిత్యం జ్వరంతో బాధపడుతుంటారు. భవిష్యత్‌లో ఫైలేరియా కేసులు నమోదు కాకుండా ఉండేందుకే చిన్నారులలో రక్త నమూనాలు సేకరించి, ఫైలేరియా పాజిటివ్ ఉన్నవారికి మెరుగైన చికిత్స అందించే విధానాన్ని అమలు చేయనున్నారు. అయితే వేల సంఖ్యలో ఉన్న చిన్నారులందరికి ఫైలేరియా పరీక్షలు చేయాల్సిన అవసరం కూడా ఉంది. ర్యాండమ్‌గా చేసే పరీక్షలతో వచ్చే పాజిటివిటిని బట్టి ఒక అంచనాకు అధికారులు వస్తారని భావిస్తున్నారు.

సమాచారం ఇలా..

వైద్యబృందాలు	: 10
ఎంపిక చేసిన స్కూళ్లు	: 60
విద్యార్థులు	: 1,540
సర్వే	: ఏప్రిల్ 1 నుంచి 7వ తేదీ

చిన్నారుల నుంచి నమూనాలు సేకరిస్తున్నాం



జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో చిన్నారుల నుంచి నమూనాలు సేకరిస్తున్నాం. పాజిటివ్ ఉన్న వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. వారికి మెరుగైన వైద్యం అందిస్తాం. పది బృందాలు చురుకుగా పనిచేస్తున్నాయి. వారికి అవసరమైన శిక్షణ కూడా ఇచ్చాం.

– మెంగని లింగం, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్

బోధకాల నిర్మూలనకు పరీక్షలు



బోధకాల వ్యాధి నిర్మూలనకు చిన్నారులకు పరీక్షలు చేస్తున్నాం. ఎంపిక చేసిన పాఠశాలల్లోని విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం పరీక్షలు చేస్తున్నాం. ఎవరికైన పాజిటివ్ వస్తే చికిత్స అందిస్తాం. బోధకాలు నిర్మూలనకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– గీతాంజలి, వైద్యాధికారి, పోతుగల్

మంత్రి కేటీఆర్‌పై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మాండ్లు



మాట్లాడుతున్న హన్మాండ్లు

గంభీరావుపేట(సిరిసిల్ల): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో మంత్రి కేటీఆర్‌ను బద్నాం చేస్తే సహించేది లేదని, ఆయనపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మాండ్లు అన్నారు. గంభీరావుపేట మండలంలోని శ్రీగాధ గ్రామంలో గురువారం నిర్వహించిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీకి మంత్రి కేటీఆర్‌కు ఎలాంటి సంబంధం లేదని, ప్రతిపక్షాలు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం అనేక రెసిడెన్షియల్ పాఠశాలలను తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ముదిరాజ్ కులస్తుల సమస్యలను ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌లకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని, నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ముదిరాజ్‌లను బీసీ–డీ గ్రూప్ నుంచి బీసీ–ఏ గ్రూప్‌నకు మార్చాలన్నారు. అనంతరం ఆయనను ముదిరాజ్‌లు సన్మానించారు. ముదిరాజ్ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు పర్శ శ్రీనివాస్, నాయకులు రమేశ్, రవి, నర్సింలు, నారాయణ, మహేశ్, పోశయ్య, అనురాధ, లావణ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే అరెస్టు

- ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ



జెండా ఎగురవేసి, మాట్లాడుతున్న ఉమ

చందుర్తి(వేములవాడ): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేశారని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ ఆరోపించారు. బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా చందుర్తి మండల కేంద్రంలో పార్టీ జెండాను గురువారం ఆమె ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ చేతకాని విధానాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులతో ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందన్నారు. నియంత పాలనకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. పేపర్ లీకేజీలతో రాష్ట్ర సర్కారు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. చందుర్తి మండలంలోని మల్యాల, నర్సింగాపూర్ గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించి, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, నాయకులు సిర్రం తిరుపతి, మెంగని శ్రీనివాస్, ఓరుగంటి విజయ్, మోతుకులపల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



కిశోర్ మృతదేహం



కిశోర్ మృతికి కారణమైన విద్యుత్ తీగలు

- వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఘటన

కోనరావుపేట(వేములవాడ): వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి యువకుడు మృతి చెందిన ఘటన కోనరావుపేట మండలం మరిమడ్లలో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాలు. మరిమడ్లకు చెందిన లోకుర్తి మల్లేశం తన వ్యవసాయ క్షేత్రాన్ని దున్నేందుకు జైసేవాలాల్ భుక్యారెడ్డితండాకు చెందిన భుక్యా కిశోర్(27)ను తీసుకెళ్లాడు. గురువారం తెల్లవారుజామున 2 గంటలకు కిశోర్ బైక్‌పై ముందు వెళ్తూ వెనుక ట్రాక్టర్‌కు దారి చూపిస్తున్నాడు. మరిమడ్ల అటవీ ప్రాంతంలోని ఎలకచెట్ల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు వన్యప్రాణుల వేట కోసం ఇనుప వైర్ అమర్చి కరెంట్ షాక్ పెట్టారు. ఆ తీగలను గమనించకపోవడంతో కిశోర్‌కు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య విజయ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుని భార్య విజయ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలోని పలు అటవీ గ్రామాల్లో గత కొన్ని రోజులుగా వన్యప్రాణుల వధ యథేచ్ఛగా సాగుతోంది. అటవీ జంతువుల కోసం వలలు, విద్యుత్ తీగలు పెడుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కనులపండువగా రాములోరి రథోత్సవం



మామిడిపల్లిలో రథాన్ని లాగుతున్న భక్తులు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లిలో శ్రీసీతారామ చంద్రస్వామి రథోత్సవం గురువారం కనులపండువగా నిర్వహించారు. గ్రామంలో శ్రీరామనవమి నుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. రథం వద్ద వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అందరూ కలిసి రథాన్ని లాగారు. కార్యక్రమంలో సర్పంచ్ కొక్కుల భారత, ఉపసర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి, మాజీ సర్పంచ్ పన్నాల విజయ, సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు, ఇన్‌చార్జి నరేందర్, జూనియర్ అసిస్టెంట్ కమలాకర్, అర్చకులు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీసీతారామస్వామి గరుడ సేవోత్సవం



గరుడ సేవోత్సవంలో పాల్గొన్న భక్తులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలో శ్రీసీతారామస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం స్వామివారికి గరుడ సేవోత్సవం కనులపండువగా నిర్వహించారు. స్వామివార్లు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయంలో హెచ్చరిక కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. ఒగ్గుడోలు కళాకారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసింది. శుక్రవారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు.

లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

- బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు

కోనరావుపేట(వేములవాడ): గ్రూప్–1, ఇంటర్, పదోతరగతి పరీక్షా పత్రాల వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు కోరారు. పరీక్షా పత్రాల లీకేజీలతో విద్యార్థులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. పరీక్షా కేంద్రంలోకి ప్రైవేట్ వ్యక్తి వచ్చి ఫొటోలు తీయడం అధికారుల వైఫల్యమేనన్నారు. ఈ ఘటనలో ఎంపీ బండి సంజయ్‌ను ఉద్దేశపూర్వకంగా అరెస్ట్ చేశారని, ఇది సరికాదన్నారు.

'పేదల నడ్డి విరిచిన కేంద్రం'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

రుద్రంగి(వేములవాడ): నిత్యావసర సరుకుల ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం పేదల నడ్డి విరిచిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు విమర్శించారు. రుద్రంగి మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ నోట్ల రద్దు సమయంలో బ్యాంకుల వద్ద క్యూలైన్‌లో గంటలకొద్దీ పేదలు నిల్చుని అష్టకష్టాలు పడ్డారన్నారు. నల్లధనం వెలికితీసి ప్రతీ ఒక్కరి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్న కేంద్ర ప్రభుత్వ హామీ ఏమైందని ప్రశ్నించారు. దీపం పథకంతో సిలిండర్‌లు ఇచ్చి.. అవే సిలిండర్‌పై రూ.600 పెంచి నిరుపేదలపై మోయలేని భారం మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో మట్టి తవ్వకాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలంలోని మల్లాపూర్ శివారు వైకుంఠధామం పరిసర భూముల నుంచి పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. మైనింగ్, రెవెన్యూశాఖల నుంచి అనుమతులు లేకుండా ఎర్రమట్టిని తరలిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతోనే మట్టి దందా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.